సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 17 । జూలై । 2023



'దర్జీ'గా ఉపాధి

కొత్త యూనిఫారాల రాకతో దర్జీలకు ఉపాధి పెరిగింది. ప్రభుత్వానికి థ్యాంక్స్ చెబుతున్నారు.
- 8లో



పేలిన కంప్రెషర్

మేలిసతివాడలోని గ్రానైట్ క్వారీలో ప్రమాదం జరిగింది. కంప్రెషర్ పేలి ఒకరు చనిపోయారు.
- 8లో

జిల్లాకు నలుగురు గ్రేడ్-3 ఈఓలు

అరసవల్లి: ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన నలుగురు గ్రేడ్-3 ఈఓలను జిల్లా దేవదాయశాఖ పరిధికి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా జరిగిన ఈ నియామకాల్లో జిల్లాకు చెందిన ఎం.సుకన్య, పి.మాధవి, డి.చరణ్, టి.మనస్విలు ఈఓలుగా ఎంపికవ్వగా.. ఈ నలుగురికి మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామని, అనంతరం విధులను కేటాయిస్తామని జిల్లా ఎండోమెంట్ అధికారి ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు.

న్యూస్‌రీల్

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదుతో బియ్యం పంపిణీ



ఓంద్రుజోల రేషన్ డిపో వద్ద డీఎస్‌ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ

కొత్తూరు: 'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదుతో ఓంద్రుజోల గ్రామంలోని రేషన్ లబ్ధిదారులకు బియ్యం అందింది. గ్రామంలోని రేషన్ డిపో పరిధిలో ఉన్న 120 మంది లబ్ధిదారులకు బియ్యం అందించలేదని జన్ని సంతోష్ అనే వ్యక్తి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. బియ్యం అందని కార్డుదారులను ఆదివారం డిపో వద్దకు పిలిపించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి వెంకటరమణ స్వయంగా డిపోకు చేరుకొని రేషన్ కార్డు దారులకు బియ్యం పంపిణీ చేయించారు. ఈ ఏడాది రెండో నెలలో వేలిముద్రలు వేసి బియ్యం ఇవ్వలేదని లబ్ధిదారుడు ఫిర్యాదు చేయగా.. అధికారులు సమస్య పరిష్కరించి అందరికీ బియ్యం అందజేశారు.

అరసవల్లిలో మహాలింగార్చన



లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు సాందీప్ శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయ అనివెట్టి మండపంలో మహాపర్వం శివపంచాయతన సహిత మహా లింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ శాస్త్రోక్తంగా క్రతువును నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తదితరులు, వేదపండితులు పాల్గొన్నారు.


'సాంకేతికతను రైతులు వినియోగించుకోవాలి'



కేవీకేలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు, పాల్గొన్న రైతులు

ఆమదాలవలస: ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందించే సాంకేతికతను జిల్లాలో రైతులు అందిపుచ్చుకొని పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి 95వ సంస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం సాంకేతిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు పాడి వెదలో తీసుకోవాల్సిన మెలకువలు, కలుపు యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి సాగు ఖర్చు తగ్గించే పద్ధతులు వివరించారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ చేపల పెంపకంలోని మెలకువలను రైతులకు వివరించారు. సస్య పోషణ శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ కుమార్ వరి ఎదలో కలుపు నివారణ గురించి విపులంగా వివరించారు.

వానలు కురవాలని వరుణ యాగం



టెక్కలి బ్రాహ్మణవీధి జంక్షన్‌లో జలాభిషేకంలో కాశీ విశ్వనాథస్వామి

టెక్కలి: వానలు సక్రమంగా కురవాలని కోరుతూ స్థానిక బ్రాహ్మణవీధి జంక్షన్‌లో గల కాశీ విశ్వనాథ ఆలయంలో ఆదివారం వరుణ యాగం చేశారు. ఆలయ అర్చకుడు గణపతి స్వామి నేతృత్వంలో వేద పండితుడు మామిడి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులంతా స్వామికి 1008 బిందెలతో జలాభిషేకం చేశారు.

అశోకవనంలో..

- టీడీపీ హయాంలో శిలాఫలకాలకే పరిమితమైన అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాకే ఇచ్ఛాపురంలో ప్రగతి పనుల జోరు
- నేడు ఇచ్ఛాపురంలో టీడీపీ బస్సు యాత్ర
- హామీలపై నిలదీతకు సిద్ధంగా ప్రజలు

కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం రూరల్: కిడ్నీ మహమ్మారి ఊళ్లకు ఊళ్లను తినేస్తుంటే.. నియంత్రించే ఒక్క పనీ చేయలేదు. అభివృద్ధి పనుల కోసం అడిగితే.. ఎన్నికల సమయం వచ్చే వరకు జనం వైపు చూడలేదు. ఏం చేశారని ఆరా తీస్తే.. నిటారుగా వేసిన శిలాఫలకాలు తప్ప చెప్పడానికి ఇంకేం లేదు. ఇచ్ఛాపురంలో బెందాళం అశోక్ పాలన తీరు ఇది. గత రెండు పర్యాయాలుగా ఇక్కడ ఆయనే ఎమ్మెల్యేగా ఉన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు హామీలు ఇవ్వడం, శంకుస్థాపనలు చేయడం తప్ప పనులు జరగలేదు. దీనికి తోడు తిత్లీ పరిహారాన్ని ఫలహారంలా తినేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మాత్రం ప్రగతి పనులు ఊపందుకున్నాయి. తుఫాన్ బాధితులను కూడా వైఎస్ జగన్ సర్కారే ఆదుకుంది. సొంత పార్టీ అధికారంలో ఉండగా నియోజకవర్గానికి ఏమీ చేయలేకపోయిన అశోక్.. వైఎస్సార్ సీపీ చేస్తున్న పనులు చూసి నిశ్చేష్టులవుతున్నారు. జనం కూడా మారుతున్నారని అర్థమవ్వడంతో మళ్లీ పసుపు జెండా పట్టుకుని బస్సు యాత్ర అంటూ సిద్ధమైపోయారు. జనం కూడా ఆయన హామీలపై ప్రశ్నించడానికి ఊళ్లలో సిద్ధంగా ఉన్నారు.



లక్కవరం గ్రామ జాతీయ రహదారి వద్ద తారు రోడ్డు నిర్మాణానికి టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన శిలా ఫలకం

శంకుస్థాపనలతో సరి..



తెలుగుదేశం పార్టీ హయాంలో రోడ్ల అభివృద్ధి కేవలం శంకుస్థాపనలతోనే సరి. ఇందుకు జలంత్రకోట పంచాయతీ పరిధిలో చొట్రాయిపురం, మాణిక్యపురం రోడ్లకు వేసిన శిలాఫలకాలే నిదర్శనం. ఎన్నికల ముందు ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసి, తర్వాత చేతులెత్తేశారు. – కొర్రాయి.శివాజీ, చొట్రాయిపురం గ్రామం, కంచిలి మండలం

అభివృద్ధిలో తగ్గేదేలే!



గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాకే ఇక్కడ పనులు జరిగాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇచ్ఛాపురం మండలం ఇప్పుడు ఎలా ఉందో ఒక్కసారి స్థానిక ఎమ్మెల్యే అశోక్ గ్రామాల్లోకి వచ్చి చూడాలి. ఆయన వేసి శిలాఫలకాలు ఇప్పుడు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. – బోర పుష్ప, ఎంపీపీ, ఇచ్ఛాపురం మండలం

టీడీపీ అధికారంలో ఉండగా ఇచ్చిన హామీలు..



కంచిలి మండలంలో చొట్రాయిపురం రోడ్డుకు ఎన్నికల ముందు టీడీపీ వేసిన శిలాఫలకం

- పంచాయతీ రాజ్ పీఐయూ విభాగంలో ఏఐఐబీ సహకారంతో నాలుగు మండలాల పరిధిలో 65 పనులకు గాను రూ.80.15కోట్ల నిధులు మంజూరైనట్టు ప్రచారం కల్పించారు. కానీ పనులేవీ జరగలేదు.
- కవిటిలో జగన్నాథ స్వామి ఆలయ మండపాన్ని విరిచి కొత్తది నిర్మిస్తామని హడావుడి చేశారు. కానీ పునాదులు మాత్రమే వేసి వదిలేశారు.
- కొబ్బరి రైతుల్ని ఆదుకునేందుకు శిలగాం సమీపంలో కోకోనట్ ఫుడ్‌పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి మర్చిపోయారు.
- ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో 2018 జనవరి 27వ తేదీన రూ.2కోట్లతో క్రీడా వికాస కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత దాన్ని పట్టించుకోలేదు.
- రూ.58.84 కోట్లతో సమగ్ర మంచినీటి సరఫరా పథకం ద్వారా నీటిని అందించడానికి, రూ.48.36 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా రోడ్లు, కాలువలు, శ్మశానాలు నిర్మిస్తామని శిలాఫలకం వేసి వదిలేశారు.
- సోంపేట మండలంలో జాతీయ రహదారి నుంచి లక్కవరం గ్రామానికి తారు రోడ్డు వేస్తామని శంకుస్థాపన చేశారు. పనులు మర్చిపోయారు.
- జాతీయ రహదారి నుంచి పలాసపురం గ్రామం వరకు 2.45 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నేటికీ శిలఫలాకాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి.
- ఎన్నికల నోటిఫికేషన్ ముందు కంచిలి మండలంలో జలంత్రకోట పంచాయతీ పరిధిలో చొట్రాయిపురం, మధుపురం, పోటుగుడ్డి తదితర గ్రామాలకు వెళ్లే రహదారిని, జలంత్రకోట నుంచి మాణిక్యపురం గ్రామానికి వెళ్లే రహదారులను తారురోడ్లుగా అభివృద్ధి చేస్తామని కేవలం శిలాఫలకం వేసి విడిచిపెట్టేశారు.

హామీల మూటలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక..



వైఎస్సార్ సీపీ హయాంలో సోంపేటలో పూర్తయిన తహసీల్దార్ కార్యాలయం



తీరప్రాంత మణిహారంగా కనిపిస్తున్న డొంకూరు తారురోడ్డు

అభివృద్ధి జాడలు

- అర్ధంతరంగా నిలిపేసిన సోంపేట–కవిటి–ఈదుపురం రోడ్డు పనులను రూ.37.39 కోట్ల నిధులతో ఈ ప్రభుత్వం పూర్తి చేసింది.
- రూ.800 కోట్లతో హిరమండలం వద్ద వంశధార నది నుంచి రక్షిత మంచినీటిని ఉద్దానంలో కిడ్నీ బాధిత గ్రామాల ప్రజలకు అందివ్వాలని మంజూరు చేసి, ఆ పనుల్ని యుద్ధప్రాతిపదికన చేస్తోంది.
- పెద్ద లక్ష్మీపురం నుంచి డొంకూరు మీదుగా బూర్జపాడు వరకు పీఎంజీఎస్‌వై నిధులు రూ.3కోట్ల 87 లక్షలతో సుమారు 5.45 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మించింది.
- రత్తకన్న నుంచి మశాఖపురం–బిర్లంగి మీదుగా హరిపురం వరకు రూ.2కోట్లతో సుమారు 8 కిలోమీటర్ల మేర తారురోడ్డును వైఎస్ జగన్ సర్కారే నిర్మించింది.
- రూ.కోటి పదిలక్షల రూపాయలతో ఇచ్ఛాపురం నుంచి కొళిగాం వరకు తారు రోడ్డును ఈ ప్రభుత్వమే ఏర్పాటు చేసింది.
- ఇచ్ఛాపురం నుంచి పురుషోత్తపురం వరకు రూ.5కోట్లతో రోడ్డు అభివృద్ధి చేశారు.
- ఇచ్ఛాపురం నుంచి కొళిగాం వరకు 10 కిలోమీటర్లు రూ.10 కోట్ల నిధులతో నిర్మించారు.
- సోంపేటలో 20, కవిటిలో 15 డయాలసిస్ బెడ్లు ఏర్పాటు చేశారు.
- 2018 నవంబర్ 28న అరకబద్ర బహుదానదిపై వంతెన నిర్మించేందుకు స్థానిక ఎంపీ రామ్మోహన్‌నాయుడుతో పాటు ఎమ్మెల్యే బెందాళం అశోక్ శంకుస్థాపన చేయడంతో పాటు పీఎస్‌ఆర్ కంపెనీ పనులు కోసం హడావిడి చేసి చేతులెత్తేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 90 శాతం పనులు పూర్తి చేసింది.
- ఈదుపురం బహుదా నదిపై కేశుపురం న్యూగ్రోయిన్ కొట్టుకుపోగా జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజుల కృషి మేరకు కలెక్టర్ నిధులు రూ.28లక్షలతో గ్రోయిన్‌ను నిర్మించారు.
- ఎన్నో ఏళ్ల కలగా ఉన్న కొర్లాం పంచాయతీ నూకలూరు గ్రామానికి తారు రోడ్డు కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే ఏర్పాటైంది.

స్త్రీలను అవమానించిన నాయకులు బాగుపడరు

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్ఎన్ పేట: మహిళలను కించపరిచిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణలను ఎవరూ క్షమించరని, రానున్న ఎన్నికల్లో మహిళలే బుద్ధి చెబుతారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మండిపడ్డారు. ఆమె ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి విజయమ్మను, సోదరి షర్మిళను, తనను అవమానించారని అన్నారు. కొరసవాడ సమావేశంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణలు ఒక మహిళా ఎమ్మెల్యే అని చూడకుండా సభ్యత, నాగరిక లక్షణాలు లేకుండా కించపరచడం, అగౌరవపరచడం ఎంత వరకు సమంజసమో వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు కరోనా సమయంలో రెండేళ్లు పాతపట్నం ప్రజలను పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో 600 హామీలు పెట్టి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. వంశధార నిర్వాసితుల డబ్బులు తినేశారని, జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారని, అందుకే 2019లో ప్రజలు మీకు ఓటేయలేదని అన్నారు. 2014లో కలమట వెంకటరమణకు వైఎస్ జగన్ సీటు ఇస్తే ఎమ్మెల్యేగా గెలిచి తల్లి లాంటి పార్టీని మోసం చేశారని దుమ్మెత్తిపోశారు. మహిళలను కించపరిచిన నాయకులకు భవిష్యత్ ఉండదని, ఆ నాయకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలోనే కాగువాడ–రొమదల వంతెన ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కె.అర్జునుడు, ఎం.తాతయ్య, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, వైస్ ఎంపీపీ ప్రదీప్, దేవాంగుల రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.చంద్రయ్య, నాయకులు బి.నారాయణమూర్తి, గెదెల సూర్యం, నల్లి రాజారావు, ప్రవీన్, సుధకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆపద అంటే ఆ..పద అంటూ



జనమంతా కోవిడ్‌కు వణికిపోతున్న సమయంలో వారే ముందుకు వచ్చి అభాగ్యులకు అండగా నిలిచారు. జీవితంలో అన్నీ కోల్పోయి దిక్కు తోచని స్థితిలో ఉన్న వారికి వారే అండదండలందించారు. వైఎస్ జగన్ సర్కారు రూపొందించిన వలంటీర్ వ్యవస్థ సామాన్యుడి తలలో నాలుకలా మెలుగుతోంది. అవసరమైన వేళ సాయం చేస్తూ, అర్హులకు న్యాయం చేస్తూ ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెడుతోంది. –మెళియాపుట్టి, కొత్తూరు

జయహో వలంటీర్...



చదువుకొనే చిన్నారులకు
అమ్మ ఒడిని చేరుస్తూ..
రెక్కలు ముక్కలుచేసుకొనే
అక్కచెల్లెమ్మలకు చేయూ
తనందిస్తూ..
ఆరుగాలం శ్రమించే
రైతన్నకు భరోసానిస్తూ..
మహిళా లోకానికి ఆసరాగా నిలుస్తూ..
కులవృత్తులవారికి చేదోడుగా ఉంటూ..
చిరు వ్యాపారులకు తోడుగా నిలుస్తూ..
క్యూలు లేవు..నిరీక్షణలు లేవు..
కోడి కూయక ముందే ఇంటి తలుపు తట్టి మరీ
అవ్వా తాతలకు ఠంచనుగా పింఛనునందిస్తూ
కోవిడ్ మహమ్మారి పంజా విసిరిన వేళ నేనున్నానంటూ ముందు నిలిచి పోరాడి మానవత్వం చూపిన
కరోనా యోధుడిగా..
ఇలా ప్రతి కుటుంబంలో ఒక అన్నగా.. అక్కగా..
ఒక కొడుకుగా..ఒక కూతురిగా.. నిలుస్తూ..
అన్నింటా నువ్వే.. అన్నిటికీ నువ్వే
ప్రతి పనిలో నువ్వే
అనుక్షణం.. అహర్నిశలూ.. ప్రజాక్షేమమే ధ్యేయంగా,
ప్రజా సంక్షేమమే ఊపిరిగా పరిపాలన సాగిస్తున్న
మన ముఖ్యమంత్రి జగనన్నకు బలం మీరే..
బలగం మీరే.. జనం మెచ్చిన జగనన్న సైన్యం మీరే
జయహో వలంటీర్ వ్యవస్థ
– కుప్పిలి ఫణీంద్రకుమార్, ఎంపీడీఓ, కోటబొమ్మాళి

వలంటీర్లు ఉండడం వల్లే..



మా కుటుంబం ఎనిమిదేళ్ల కిందట హైదరాబాద్‌కు వలస వెళ్లింది. అక్కడ నా భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. మళ్లీ గ్రామానికి వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటున్నాను. ప్రభుత్వ పథకాల గురించి నాకు ఏమీ తెలియదు. జగనన్న ప్రభుత్వంలో వచ్చిన వలంటరీ వ్యవస్థ ద్వారా నాకు ఎంతోమేలు జరిగింది. మా వలంటీర్ గేదెల ఢిల్లేశ్వర రావు నాకు అన్నీ వివరించి అన్ని పథకాలకు దరఖాస్తు చేయించారు. దీంతో అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, పెన్షన్ కానుక పథకాలు వస్తున్నాయి. పిల్లలతో సంతోషంగా ఉన్నాను. వలంటరీ వ్యవస్థే లేకపోతే ఎక్కడికి వెళ్లాలో? ఎవరికి సమస్యలు చెప్పుకోవాలో తెలియని స్థితి ఉండేది.
– సిరిపురం చిన్నమ్మి, పెద్దపద్మాపురం

వలంటీర్లే బంధువులయ్యారు..



నా పేరు బుక్కపట్నం జయకృష్ణ. మాది కొత్తూరు మండలం ఎస్ఎన్ కాలనీ. కోవిడ్ సమయంలో నా భార్య కృష్ణవేణి చనిపోయింది. కరోనా భయంతో ఎవరూ మృతదేహాన్ని చూసేందుకు కూడా రాలేదు. అలాంటి పరిస్థితుల్లో కర్లెమ్మ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు విశాఖ సూరిబాబు, గొడబ లక్ష్మరావు, వడ్డి గౌరీ, గేదెల గణేష్, సొండి రాజాతో పాటు మరికొంత మంది ఆస్పత్రికి వచ్చి నా భార్య మృతదేహాన్ని శ్మశానం వరకు తీసుకెళ్లారు. వలంటీర్లే దహన సంస్కారాలు పూర్తి చేశారు. అప్పుడు వలంటీర్లు చేసిన సాయం నా జీవితంలో మరువలేను.

అవకాశాలు వినియోగించుకోండి: ఎస్పీ



విద్యార్థులతో ఎస్పీ రాధిక, అదనపు ఎస్పీలు, పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు పడిన కష్టాలకు మీ విజయమే ప్రతిఫలమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం మన ఆణిముత్యాలు–2023 పేరుతో పదో తరగతి (550 పైబడిన మార్కులు) విద్యార్థులు 19 మంది, ఇంటర్మీడియట్ (950 పైబడి మార్కులు) 12 మంది, నీట్, జేఈఈ (అడ్వాన్స్), బిట్స్, ఎంసెట్ తదితర ఎంట్రెన్స్ టెస్టుల విభాగాల్లో ఎనిమిది మంది చొప్పున ఉత్తమ ర్యాంకులు సాధించిన పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించినప్పుడే తల్లిదండ్రులకు మంచి గౌరవం లభిస్తుందన్నారు. సమాజంలో పోలీసుల పిల్లలకు ఓ ప్రత్యేకత ఉంటుందన్నారు. విద్యార్థి దశలో ఎలాంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా సన్మార్గంలో నడవాలని, సోషల్ మీడియా ప్రభావానికి గురికాకుండా అవసరానికి తగ్గట్టుగా సెల్‌ఫోన్లు ఉపయోగించాలని సూచించారు. అదనపు ఎస్పీ (క్రైమ్) టీపీ విఠలేశ్వరరావు మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కారం గొప్పదని, విద్యార్థి దశలో నీతి నిజాయితీతో నడుచుకోవాలని చెప్పారు.

అదనపు ఎస్పీ (అడ్మిన్) జె.తిప్పేస్వామి మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో టౌన్ డీఎస్పీ యర్రగుంట శృతి, డీఎస్పీ బాలరాజు, పోలీసు సంఘ కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, కె.అప్పన్న, జగదాంబ, భుజంగరావు, నర్సింగరావు, కృష్ణమనాయుడు, పోలీసు సిబ్బంది, వారి కుటుంబసభ్యులు, పిల్లలు పాల్గొన్నారు.

ఉద్ధృతంగా మహేంద్ర తనయ

ఒడిశాలో ఇటీవల పడిన వర్షాలకు మహేంద్ర తనయ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రం పాతపట్నంతో పాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో సింగుపురం, లాబర, కొరసవాడ, బోరుబద్ర, కాగువాడ, పెద్దలోగిడి, చిన్నమల్లిపురం గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలు వరి వెదలు చిగురిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. - పాతపట్నం



'ప్రస్తుత ఫీజులతో కళాశాలలు నడపలేం'

శ్రీకాకుళం అర్బన్: డిగ్రీ కోర్సుల ఫీజుల నిర్ణయంలో హేతుబద్ధత లేదని, ప్రస్తుతం నిర్ణయించిన ఫీజులతో కళాశాలలు నడపడం కష్టమని జిల్లా ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు పొన్నాన జయరాం అన్నారు. ఆదివారం జిల్లా ప్రైవేటు కళాశాలల యాజమాన్య సభ్యులతో కలిసి శ్రీకాకుళంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని మౌలిక వసతులున్న కాలేజీలకు గత ఏడాది కంటే తక్కువ ఫీజులు నిర్ణయించడం విచారకరమని అన్నారు. ఏళ్లు గడిచేకొద్దీ ఏ విషయంలోనైనా ఖర్చులు పెరుగుతాయని, దీనికి భిన్నంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల విషయంలో తిరోగమనంగా ఫీజులు తగ్గించడం వల్ల చిన్న కళాశాలలు మూతపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు, నిష్ణాతులైన అధ్యాపక సిబ్బంది, ల్యాబ్ సౌకర్యం, గ్రంథాలయాలు ఉన్నపటికీ ఫీజులు తగ్గించడం తగదన్నారు. మరో వైపు కొన్ని కళాశాలలల్లో 25 శాతం కంటే తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న కారణంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ తొలగించడం దారుణమని అన్నారు. కార్యకమంలో సంఘ ప్రతినిధులు సీహెచ్ దుర్గా ప్రసాద్, ఎం నిరంజన్, బి చిట్టిబాబు, వివిధ కళాశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'అక్షయపాత్ర'కు ఐఎస్ఓ గుర్తింపు


అక్షయ పాత్ర నిర్వాహకులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురంలో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వంటశాలకు (ఐఎస్ఓ 2200–2018) గుర్తింపు లభించిందని ఆపరేషన్స్ మేనేజర్ పి.వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా శ్రీకాకుళం, గార, ఆమదాలవలస మండలాల్లోని 309 ప్రభుత్వ పాఠశాలలకు ఇక్కడి నుంచే భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. వంట, నిల్వ, పరికరాలు నిర్వహణ, భోజన రవాణా, శుచి, శుభ్రతతో కూడిన విధానంతో గుర్తింపు వచ్చినట్లు పేర్కొన్నారు. భగవంతుని ఆశీర్వాదం వల్ల గుర్తింపు వచ్చిందని అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ భక్తదాసు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటం


మాట్లాడుతున్న వీజీకే మూర్తి

శ్రీకాకుళం అర్బన్: సంఘటితంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని గరిమెళ్ల విజ్ఞానకేంద్రం అధ్యక్షుడు వీజీకే మూర్తి, పోస్టల్ సంఘ ప్రతినిధులు అన్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్, అనుబంధ సంఘాలైన ఏఐపీఈయూ–గ్రూప్–సి, పోస్ట్‌మ్యాన్ అండ్ ఎంటీఎస్ అండ్ జీడీఎస్ అనుబంధ సంఘాల ద్వైవార్షిక మహాసభలు శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ఆదివారం నిర్వహించారు. గ్రూప్–సి సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఇ.శంకర్‌నాయుడు, బి.శ్రీధర్‌బాబు, పోస్ట్‌మ్యాన్ అండ్ ఎంటీఎస్ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామానందం, జీడీఎస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ గ్రూప్–సి సంఘాల గుర్తింపు రద్దు చేసిందని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.జీడీఎస్ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిబ్బందిపై వేధింపులు ఆపాలన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో ఏఐపీఈయూ–గ్రూప్–సి అధ్యక్ష, కార్యదర్శులుగా యు.వి.రమణ, కె.గణపతి, పోస్ట్‌మేన్ అండ్ ఎంటీఎస్ అధ్యక్ష కార్యదర్శులుగా టి.వెంకటేశ్వర్లు, ఎల్.బాబూరావు, జీడీఎస్ అధ్యక్ష, కార్యదర్శులుగా బి.ఎస్.ఆర్.మూర్తినాయుడు, ఎన్.నందికేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 400 మంది ఉద్యోగులు, పోస్టల్ పెన్షనర్లు హాజరయ్యారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇటీవల బదిలీ అయిన వేలాదిమంది ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం బాధాకరమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా కేంద్రంలోని క్రాంతి భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఎస్టీయూ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు వారాల క్రితం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్పందన కార్యక్రమంలో బదిలీల్లో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు చేశామని, ఇంతవరకు స్పందన లేదన్నారు. కొన్ని ఫిర్యాదులకు జిల్లా విద్యాశాఖ అధికారి అసంబద్ధమైన సమాధానాలు ఇచ్చారని, వాటిని రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. నెల జీతాలపై ఆధారపడిన వేతనజీవులను బాధపెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా బదిలీల అనంతరం చేయాల్సిన రీఅపోర్షన్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసి, డిప్యూటీ డైరెక్టర్ జిల్లా ట్రెజరీ అధికారికి రీఅపోర్షన్ డాటా సమర్పించాలన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు పడాల తమ్మినాయుడు, తేజేశ్వరరావు, ఎస్వీ రమణమూర్తి, రామారావు, శ్రీధర్, శ్రీను, రమణ, రాజు, సన్యాసిరావు, రమేష్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కె. 10గ్రా.)	60,000–00
బంగారం(22కె. 10గ్రా.)	55,000–00
వెండి (కిలో)	81,800–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

దర్జీగా ఉపాధి

- జగనన్న విద్యాకానుక యూనిఫాంతో టైలర్లకు చేతినిండా పని
- జిల్లాలో 1,45,153 మంది విద్యార్థులకు మూడు జతల యూనిఫాం
- ఆనందం వ్యక్తం చేస్తున్న దర్జీలు


కోటబొమ్మాళిలో యూనిఫాం కుడుతున్న టైలర్లు

కోటబొమ్మాళి : ఒకప్పుడు టైలర్లకు చేతినిండా పని ఉండేది. వినియోగదారులు వస్త్రం ఇచ్చిన రెండు మూడు వారాలకు కుట్టి ఇచ్చేవారు. దర్జీలకు అంతగా డిమాండ్ ఉండేది. అయితే రెడీమేడ్ రాకతో వీరికి పని తగ్గిపోయింది. క్రమేపీ టైలర్ వృత్తిదారులు సైతం తగ్గిపోయారు. ఈ తరుణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా రూ.10 వేలు అందిస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. దీనికితోడు జగనన్న విద్యాకానుకలో భాగంగా ప్రతి విద్యార్థికి మూడు జతల యూనిఫాం అందిస్తుండటంతో టైలర్లకు చేతినిండా పని దొరుకుతోంది.

జిల్లాలో 50 వేల మందికి లబ్ధి..

జిల్లాలో సుమారు 50 వేల మంది టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 1 నుంచి 10 తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న లక్షా 45 వేల153 మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు జతలు చొప్పున యూనిఫాం అందజేసింది. పాత యూనిఫాం స్థానంలో కొత్త రంగులతో వస్త్రం అందజేసింది. జిల్లా వ్యాప్తంగా ఒకేసారి లక్షల సంఖ్యలో విద్యార్థులు యూనిఫాం కుట్టించుకునేందుకు టైలరింగ్ షాపులకు వెళ్తుండటంతో దర్జీలు బిజీబిజీగా ఉంటున్నారు. గతంలో కరోనా సమయంలోనూ పనిలేని సమయంలో జగనన్న విద్యాకానుక యూనిఫారాలే ఆదుకున్నాయని టైలర్లు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ప్రతి విద్యార్థికి యూనిఫాం కుట్టు కూలీ కోసం రూ.120 చొప్పున్న విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం జమచేస్తోందని కోటబొమ్మాళి ఎంఈఓ–2 లఖినాన విశ్వప్రతాప్ తెలిపారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



ప్రస్తుతం రెడీమేడ్ దుస్తుల రాకతో పని తక్కువగా నున్న సమయంలో నాలుగేళ్లుగా జగనన్న విద్యాకానుక యూనిఫారాలు ఆదుకున్నాయి. ఈ ఏడాది కూడా దుస్తులు కుట్టేపనిలో బిజీగా ఉన్నాం. టైలర్లకు పనికల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ధన్యవాదాలు.

– యిర్రి చిరంజీవి, టైలర్, కోటబొమ్మాళి

యూనిఫాంతో ఉపాధి..



టైలర్లకు ఇప్పటికే ప్రభుత్వం ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తోంది. దీనికితోడు జగనన్న యూనిఫాం కుట్టుపనితో జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరింది. టైలర్లంతా యూనిఫాం కుట్టేపనిలో బిజీగా ఉన్నారు.

– ఐ.అప్పారావు, కోటబొమ్మాళి మండల టైలర్ల సంఘం అధ్యక్షుడు

కళింగ కోమట్ల సంక్షేమానికి కృషి


పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తదితరులు

- కళింగాంధ్రా గాంధీ పుస్తకావిష్కరణ సభలో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం కల్చరల్: కళింగ కోమట్లను ఓబీసీ జాబితాలో చేర్పించేందుకు తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కళింగ వైశ్య కల్యాణ మండపంలో 'కళింగాంధ్రా గాంధీ పొట్నూరు స్వామిబాబు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. కళింగ కోమటి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాజకీయ లబ్ధికోసం చెప్పే మాటలు నమ్మవద్దని, రాజకీయం కావాలా, సామాజిక వర్గం శ్రేయస్సు కావాలో ఆలోచించాలని కోరారు. కళింగ కోమట్ల సామాజిక వర్గ సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. పొట్నూరు స్వామిబాబు జీవన విధానం, ఆయన ఆశయాల సాధన కోసం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకువచ్చిన రచయిత నల్లి ధర్మారావు, సహకారం అందించిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి ఫెడరిక్‌లను అభినందించారు. వితంతు వివాహాలు చేయడం, ఆసుపత్రులు, అనాథశరణాలయాల నిర్మాణం, స్వాతంత్ర్య సమరయోధులకు చేయూతనివ్వడం వంటి గొప్ప పనులను స్వామిబాబు చేశారని గుర్తు చేశారు.

నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ స్వామిబాబు జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, రాష్ట్ర కళింగ కోమట్ల సంఘం అధ్యక్షుడు పట్నాల శ్రీనివాసరావు(కోణార్క్ శ్రీను), జామి భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా బ్యాడ్మింటన్ పోరు

- మెన్స్ సింగిల్స్, డబుల్స్‌లో శ్రీకర్ విజయదుందుభి
- అండర్–19 సింగిల్స్, డబుల్స్‌లో చాంపియన్‌గా వంజరావు ప్రవీణ్


విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో జిల్లా బ్యాడ్మింటన్ ప్రతినిధులు, నిర్వహణ కమిటీ సభ్యులు, టెక్నికల్ సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ న్యూరోకేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన రెండు రోజుల జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2023 పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. వివిధ విభాగాల్లో విజేతలగా నిలిచిన క్రీడాకారులకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, స్పాన్సర్ గ్లోబల్ న్యూరోకేర్ ఎండీ డాక్టర్ దేవరెడ్డి గౌతమ్ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందు వారు మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, సీఈవో సంపతిరావు సూరిబాబు, టీషర్టుల స్పాన్సర్ జి.భీమారావు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఎంఎం విలేకర్, గురుగుబెల్లి ప్రసాద్, ఎంతఃరత్నాజీ, వంజరాపు కవీశ్వరరావు, అనిల్‌కుమార్, ఎం.శాంతికుమార్, పలాస, సోంపేట బ్యాడ్మింటన్ క్లబ్‌ల ప్రతినిధులు, కోచ్‌లు, అంపైర్లు, టెక్నికల్ సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- సీనియర్స్ పురుషుల విభాగం సింగిల్స్, డబుల్స్‌లో ఎం.శ్రీకర్ (కంచిలి) చాంపియన్‌గా నిలవగా, అండర్–19, 17 రెండు వయో విభాగాల్లో సింగిల్స్, డబుల్స్‌లో వంజరాపు ప్రవీణ్ (పాతపట్నం) చాంపియన్‌గా నిలిచాడు.
- సీనియర్స్ పురుషుల విజేతగా ఎం.శ్రీకర్, రన్నరప్‌గా కె.సాయికుమార్ (శ్రీకాకుళం). మెన్స్ డబుల్స్‌లో శ్రీకర్–సోమేష్(కంచిలి) జంట విజేతగా, ప్రవీణ్–సాయిదత్త(శ్రీకాకుళం) జంట రన్నరప్‌గా నిలిచారు. మహిళల సింగిల్స్‌లో గురుగుబెల్లి కావ్య (శ్రీకాకుళం) విన్నర్‌గా, గుంపాన హేమ (విటీఏ) రన్నరప్‌గా నిలిచింది. డబుల్స్‌లో ఇందిర వాణిశ్రీ–జక్కం రోహిత (సోంపేట) చాంపియన్‌గా నిలిచారు.
- అండర్–19లో విజేతగా వి.ప్రవీణ్, రన్నరప్‌గా ఎ.అభిరామ్ (ఎస్‌సీఐబీసీ), డబుల్స్ విజేతగా బి.నిఖిల్–సీహెచ్ రేవంత్ (పలాస) జంట నిలవగా, ఎం.లక్ష్మీదీపక్–ఎస్.సుమంత్ (చాపర) రన్నరప్‌గా నిలిచారు. బాలికల సింగిల్స్‌లో సీహెచ్ మోక్షాజ్ఞ (శ్రీకాకుళం)విజేతగా, ఎం.శ్రావ్య (జీఎంఆర్) రన్నరప్‌గా నిలిచారు.
- అండర్–11, 13, 15, 17 విభాగాల్లో శ్రీకాకుళం, పలాస, సోంపేట, కవిటి, చాపర, పాతపట్నం తదితర ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు విజేతలగా నిలిచారు.

ఐకమత్యంతోనే సొండి కులస్తుల అభివృద్ధి


సమావేశంలో చర్చిస్తున్న సొండికుల సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అత్యంత వెనుకబడి ఉన్న సొండి కులస్తులంతా ఐక్యతగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని సిక్కోలు సొండి కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సేనాపతి శేషగిరిబాబు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రవేటు భవనంలో ఆదివారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం అభివృద్ధి జరగాలంటే సభ్యత్వ రుసుము కింద ప్రతి కుటుంబం రూ.200, కార్యవర్గ సభ్యులు రూ.500 చెల్లించాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గంలో శ్రీకాకుళం నగర సభ్యులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. అబ్కారీ శాఖలో సొండి కులస్తులకు షాపులు రిజర్వు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సొండి కులస్తులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలన్నారు. సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి రత్నాల జగన్మోహనరావు, గౌరవ అధ్యక్షుడు రత్నాల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

సోంపేట: మండలంలోని ఎర్రముక్కాం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కంబాల అయ్యమ్మ (103) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఇప్పటికే ముగ్గురు కుమారులు మృతి చెందారు. అయ్యమ్మ మృతి చెందడంతో అత్యధిక సంఖ్యలో గ్రామస్తులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.


అయ్యమ్మ(ఫైల్)

శివసాగర్ బీచ్‌లో యువకుడు గల్లంతు


నవీన్

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ఆదివారం యువకుడు గల్లంతైన విషాద సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, తోటి స్నేహితులు తెలిపిన వివరాల మేరకు.. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం గ్రామానికి చెందిన కొండె నవీన్(23) స్నేహితులతో కలిసి శివసాగర్ బీచ్‌కు వచ్చాడు. సరదాగా కాసేపు తీరంలో గడిపి సముద్రంలో స్నానానికి దిగారు. స్నానం చేస్తుండగా భారీ అల రావడంతో కొట్టుకుపోయాడు. స్నేహితులంతా తీరానికి చేరుకున్నా నవీన్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఏఎస్సై జిన్నారావు తెలిపారు. కాగా, నవీన్ డిగ్రీ పూర్తిచేసి పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. ఉద్యోగం చేసి అండగా నిలుస్తాడన్న ఒక్కగానొక్క కుమారుడు గల్లంతు కావడంతో తల్లిదండ్రులు నాగరాజు, చామంతి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

స్టేట్ ఓపెన్ చెస్ చాంపియన్‌గా సాత్విక్

- ముగిసిన రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన మంత్రి ధర్మాన ప్రసాదరావు


మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విజేతలతో మంత్రి ధర్మాన ప్రసాదరావు, నిర్వాహకులు, సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కోనసీమకు చెందిన డీఎస్ఏ స్ఎస్‌యూ సాత్విక్ రాష్ట్ర ఓపెన్ చెస్ చాంపియన్‌గా నిలిచాడు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీలో ఉన్న న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా కార్తికేయ స్పోర్ట్స్ అకాడమీ, సీఎస్ఎన్ ట్రస్ట్ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, శ్రీకాకుళం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన ఏపీ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు (జననాయక్ చౌదరి సత్యనారాయణ ట్రోఫీ) ఆదివారంతో ముగిశాయి. హోరాహోరిగా సాగిన ఈ పోటీల్లో ఓపెన్ విభాగంలో 7 రౌండ్లకుగాను సాత్విక్ 6.5 పాయింట్లను సాధించి విజేతగా నిలిచాడు. అనకాపల్లికి చెందిన బి.సాకేత్ రన్నరప్‌గా నిలిచాడు. విశాఖపట్నంకు చెందిన ముమ్మాడ వెంకట రుత్విక్ మూడోస్థానం, విశాఖకు చెందిన ఎస్.వరహాలు నాలుగో స్థానం, శ్రీకాకుళంకు చెందిన కుప్పిలి సాయివెంకట్ ఐదో స్థానంలో నిలిచారు. ఓపెన్ విభాగంలో 20 మందికి, వివిధ విభాగాల్లో చిన్నారులకు కలిపి రూ.52వేల నగదు బహుమతులు, ప్రసంశాపత్రాలు, పతకాలు, మెమొంటోలు అందజేశారు.

చెస్‌తో మేథస్సుకు పదును: మంత్రి ధర్మాన

ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు చెస్ క్రీడతో మేథస్సు పెరుగుతుందన్నారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సనపల భీమారావు రెండు రోజుల చెస్‌మీట్ వివరాలను, ఏర్పాట్లను వివరించారు. ఆగస్టులో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర అండర్–11 చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు, టోర్నమెంట్ డైరెక్టర్ చౌదరి సతీష్, వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు బి.అజంత, కామేశ్వరి, న్యూసెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, చౌదరి అవినాష్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్, వైఎస్‌వీ కుమార్, బగ్గ అభినవ్, చీఫ్ ఆర్బిటర్ ఫణికుమార్, ఆర్బిటర్లు నరేష్, నాయక్, చలపతిరావు, టెక్నికల్ సిబ్బంది, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భోజనానికి ఇంటికి వెళ్తుండగా..

- టాటామ్యాక్సీ ఢీకొని వ్యక్తి మృతి
- మరొకరికి గాయాలు


లచ్చయ్య గ్రామ కూడలి వద్ద మృతదేహం

బూర్జ: భోజనం చేసేందుకు సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న మామాఅల్లుళ్లను టాటామ్యాక్సీ క్యాబ్ ఢీకొట్టింది. ఈ ఘటనలో మామ మృతిచెందగా, అల్లుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్జ మండలం లచ్చయ్యపేటకు చెందిన సీర సన్యాసిరావు (62) అల్లుడు కొంచాడ రమేష్‌తో కలిసి కొల్లివలస, లచ్చయ్యపేట గ్రామాల సమీపంలో కూలీ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు సైకిల్‌పై ఇద్దరూ ఇంటికి వెళ్తుండగా..పాలకొండ వైపు నుంచి వస్తున్న క్యాబ్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సైకిల్ వెనుక కూర్చున్న సన్యాసిరావు రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సైకిల్ తొక్కుతున్న రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 సిబ్బంది శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సన్యాసిరావుకు భార్య లచ్చమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య లచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని యువకుడు మృతి


యువకుడి మృతదేహం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి వంతెన వద్ద ఆదివారం ఉదయం గుర్తు తెలియని యువకుడు(25) అనుమానాస్పద రీతిలో అపస్మారక స్థితిలో ఉండటంతో స్థానికులు 108 ద్వారా ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా మృతి చెందడంతో రూరల్ ఎస్ఐ వి.రమేష్ కేసు నమోదు చేశారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. యువకుడు బూడిద రంగు టీ షర్టు ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసిన వారు 630999086, 9089447 231337 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక అలంకరణలో ఉమాజఠలేశ్వరుడు



జిల్లా కేంద్రంలోని నక్కవీధిలో ఉమాజఠ లేశ్వరస్వామి దేవాలయంలో మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్ర పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి నారికేళజలంతో అభిషేకాలు జరిగాయి. అనంతరం రకరకాల పండ్లతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్

గ్రానైట్ క్వారీలో పేలిన కంప్రెషర్

- బీహార్‌కు చెందిన వ్యక్తి మృతి
- మరో ముగ్గురికి గాయాలు


మృతిచెందిన భూషణ్‌దాస్

టెక్కలి రూరల్: టెక్కలి మండలం మేఘవరం పంచాయతీ మేలిసతివాడ గ్రామ సమీపంలో ఉన్న సీహెచ్.రావు క్వారీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బీహార్‌కు చెందిన కార్మికులు క్వారీలో గ్రానైట్ రాళ్లను డ్రిల్లింగ్ చేస్తుండగా అక్కడే ఉన్న ఎయిర్ కంప్రెషర్ మిషన్ ఒక్కసారిగా పేలిపోయింది. పేలుడు ధాటికి అక్కడికి సమీపంలో మిషన్ ఆపరేటింగ్ చేస్తున్న బీహార్ రాష్ట్రం వెస్ట్‌చంపారన్ జిల్లాకు చెందిన భూషణ్‌దాస్(53) తుళ్లిపడటంతో మెడకు తీవ్ర గాయమైంది. బోల కుమార్, డ్రూప్ శాని, రోషన్‌కుమార్‌ల పైకి ఆయిల్ తుళ్లిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను క్వారీ వాహనంలో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన భూషణ్‌దాస్ మృతిచెందాడు. మిగిలిన ముగ్గురూ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు క్వారీ యాజమాన్య ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు.